క్లుప్తంగా

కరువు మండలాలు ప్రకటించాలని వినతి



డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం రాష్ట్ర నాయకులు బండి వెంకటేశ్వరరావు

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లాలో వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు నష్ట పోయిన మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ కోరారు. ఏపీ కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ప్రతినిధులతో కలిసి డీఆర్వో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోస్తా ఆంధ్ర జిల్లాల్లో 1.49 మీటర్లు సాధారణ స్థాయి కన్నా వర్షపాతం తగ్గిందన్నారు. ఈ కారణంగా ఖరీఫ్ పంటలో సాధారణ విస్తీర్ణం తగ్గిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, సీపీఐ నాయకులు పుప్పాల కన్నబాబు, ఏపీ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ యామిని పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జనార్ధన స్వామి పవిత్రోత్సవాలు



ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని జనార్ధన, శ్రీ నగరేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో భూనీళా సమేత జనార్ధనస్వామి, రంగ నాయక స్వామి వార్ల పవిత్రోత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల రెండవ రోజున శనివారం ఉదయం సుప్రభాత సేవ, నిత్యార్చన (సహస్ర నామార్చన), చతుస్థానార్చన, ద్వార తోరణారాధన, ధ్వజ కుంభారాధన నిర్వహించారు.సాయంత్రం నిత్యార్చన హోమాదులు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు వంగల పవన్ కుమార్ తెలిపారు.

రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

ఏలూరు (టూటౌన్): రాజ్యాంగ దినోత్సవాన్ని 26న ప్రతి ఒక్కరూ ఘనంగా నిర్వహించాలని ఆల్‌ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ కోరారు. స్థానిక నరసింహారావు పేటలోని సంఘ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవ కార్యక్రమాల్లో ప్రతి పౌరుడు పాల్గొనాలని పిలుపు నిచ్చారు. దేశంలోని ప్రతి పౌరుడికి స్వేచ్ఛ కల్పించిన భారత రాజ్యాంగాన్ని అందరూ గౌరవించాలని కోరారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

గడపగడపలో సంక్షేమ కాంతులు

- ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్లనాని
- ఏలూరులో 128వ రోజు 'గడపగడపకు'
- 21, 22 డివిజన్లల్లో పర్యటన



ఏలూరు సత్రంపాడులో వృద్ధురాలికి పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని, చిత్రంలో డాక్టర్ దిరిశాల

ఏలూరు టౌన్ : రాష్ట్రంలోని పేదవర్గాల ప్రజల కుటుంబాల్లో సంక్షేమ కాంతులు వెల్లువిరిసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాలు అమలు చేస్తున్నారని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్లనాని అన్నారు. ఏలూరు నగరంలో శనివారం 128వ రోజు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఉత్సాహంగా సాగింది. సత్రంపాడులోని 21, 22 డివిజన్లల్లో ఎమ్మెల్యే నాని పాదయాత్రగా ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిశారు. పథకాలు ఏ విధంగా అందుతున్నాయో వారిని అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, కార్పొరేటర్ అన్నపనేని భారతి, పార్టీ నాయకులు అన్నపనేని రవికుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నానికి ఘన స్వాగతం పలికారు. డివిజన్లల్లో పర్యటిస్తూ అవ్వా, తాతలను ఆప్యాయంగా పలకరిస్తూ చిన్నారులను ఆశీర్వదిస్తూ మహిళలతో మాట్లాడి వారి కష్టాలు తెలుసుకుంటూ ఎమ్మెల్యే నాని పర్యటించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ సమాజంలో పేదవర్గాల ప్రజలు ఆనందంగా జీవించేలా ప్రత్యేక కార్యాచరణ, ప్రణాళికతో సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని చెప్పారు. కుటుంబాలు ఆర్థికంగా బలపడినప్పుడే సామాజిక పరిస్థితుల్లోనూ మార్పులు సంతరించుకుంటాయనే ఆర్థిక నిపుణుల అభిప్రాయాలకు అనుగుణంగా రాష్ట్రంలో సంక్షేమ కాంతులు కుటుంబాలను నింపేలా నవరత్నాలను అందిస్తున్నారని చెప్పారు. ప్రజల జీవన విధానాల్లో మార్పులు తీసుకువస్తూ వారి ఆర్థిక అభ్యున్నతికి పాటుపడుతున్నారని చెప్పారు. గతంలో చంద్రబాబు హయాంలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరావు, పార్టీ జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, అదనపు కమిషనర్ సీహెచ్ బాపిరాజు, కార్పొరేటర్లు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ నేతలు హాజరయ్యారు.

హైకోర్టు న్యాయమూర్తి కృష్ణ మోహన్‌కు ఘన స్వాగతం



హైకోర్టు న్యాయమూర్తి కృష్ణమోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఏలూరు ఎస్పీ మేరిప్రశాంతి

ఏలూరు టౌన్: రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం హైకోర్టు న్యాయమూర్తి బీ. కృష్ణమోహన్ పశ్చిమగోదావరి జిల్లా పర్యటనలో భాగంగా ఏలూరు వచ్చారు. ఆయనకు పలువురు అధికారులు ఘన స్వాగతం పలికారు. హైకోర్టు న్యాయమూర్తి కృష్ణమోహన్‌ను ఏలూరు జిల్లా ఎస్పీ డీ.మేరి ప్రశాంతి మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు మొక్క అందజేశారు.

ప్రతిష్టాత్మకంగా ఆర్టీసీ కార్గో సర్వీసు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ డైరెక్టర్ రాజారెడ్డి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో ప్రజలకు పార్శిల్ రవాణా సేవలు అందించడానికి ఆర్టీసీ ప్రారంభించిన కార్గో సర్వీసులు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని ఆర్టీసీ బోర్డు డైరెక్టర్ ఏ. రాజారెడ్డి తెలిపారు. కార్గో సర్వీసెస్ పర్యవేక్షణ నిమిత్తం శనివారం రాజారెడ్డి ఏలూరు విచ్చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థని ముందు అడుగు వేసే దిశగా యువ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆర్టీసీ కార్మికులందరినీ 2020లో విలీనం చేసి చరిత్ర సృష్టించారని తెలిపారు. కార్గో సేవలు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని అతి తక్కువ ధరతో రాష్ట్రంలో ఎక్కడికైనా కేవలం 24 గంటలలోపు పూర్తి భద్రతతో వినియోగదారుల సరుకును వారికి అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. 2025 మార్చి నాటికి రూ. 1000కోట్లు ఆదాయం లక్ష్యంగా కార్గో విస్తృత సేవలతో ముందడుగు వేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఒక్కరి ఆదరాభిమానాలు, నమ్మకాన్ని చూరగొన్న కార్గో సేవలను ఆదరిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో అతి త్వరలో 1500 కొత్త బస్సులు రోడ్లమీదకి రాబోతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో కార్గో సర్వీస్ మరింత ఊపందుకుందని, అదేవిధంగా డోర్ డెలివరీ మాసోత్సవాల్లో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలు ముందడుగులో ఉన్నాయని స్పష్టం చేశారు.

అర్హులందరికీ పథకాలు అందించాలి

ఎమ్మెల్యే ఆళ్ల నాని



క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ఆళ్లనాని

ఏలూరు టౌన్: రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా ఏలూరు నియోజకవర్గంలో అర్హులందరికీ పథకాలు అందించేందుకు అధికారులు కృషి చేయాలని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని చెప్పారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో 25వ డివిజన్‌లో ఇటీవల నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతుల పరిష్కారంపై ఆయన అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సమీక్షలో ఎమ్మెల్యే ఆళ్ల నాని మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రాష్ట్ర సర్కారు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజలు నుంచి వచ్చిన వినతులు, ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు అధికారులు తమ వంతు కృషి చేయాలని చెప్పారు. 25వ డివిజన్‌లో ప్రజలకు అవసరమైన పలు అభివృద్ధి పనులకు సంబంధించి రూ. 40 లక్షలతో రూపొందించిన ప్రతిపాదనలను ఆమోదించామన్నారు. ఈ పనులను త్వరలో ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరావు, కార్పొరేట్ గునిపూడి శ్రీనివాసరావు, పార్టీ జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, తహసీల్దార్ బీ.సోమశేఖర్, పీఓ కృష్ణమూర్తి, ఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి, సచివాలయ ఉద్యోగులున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించండి

ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ఆటోడ్రైవర్లు సహకరించాలని పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు చెప్పారు. ఏలూరు జిల్లా ఎస్పీ డీ. మేరిప్రశాంతి ఆదేశాలపై ఏలూరు వన్‌టౌన్ సర్కిల్ స్టేషన్‌లో శనివారం ఏలూరు వన్‌టౌన్, రూరల్ పరిధిలోని ఆటోయూనియన్లు, ఆటో డ్రైవర్లతో రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల, పాఠశాలల విద్యార్థులను తీసుకువెళ్లే ఆటో డ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలుపై డీఎస్పీ వారికి అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ ఏలూరు నగరం పరిసర ప్రాంతాల్లో ప్రయాణించే ఆటోడ్రైవర్లు వేగనియంత్రణ చేసుకుంటూ రోడ్డు ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. విద్యా సంస్థలకు విద్యార్థులను తీసుకువెళ్ళే ఆటో డ్రైవర్లు పిల్లలను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు శ్రద్ధ వహించాలని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులతో సహకరించాలని చెప్పారు. ఆటో డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చెప్పారు. ఈ సమావేశంలో ఏలూరు వన్‌టౌన్ సీఐ ఎస్ రాజశేఖర్, ఎస్సైలు రామకృష్ణ, లక్ష్మణబాబు, రాజారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

వినియోగదారుల హక్కుల రక్షణకు ప్రత్యేక చట్టాలు



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న కొవ్వలి వినియోగదారుల సేవా మండలి ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వినియోగదారుల హక్కుల రక్షణ కోసం ఏర్పడిన చట్టాలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని న్యాయవాది కట్టా సత్యనారాయణ సూచించారు. కొవ్వలి వినియోగదారుల సేవామండలి ఆధ్వర్యంలో శనివారం స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై, వినియోగదారుల చట్టం–2019పై ప్రిన్సిపాల్ పీ. గిరిబాబు అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయవాది కట్టా సత్యనారాయణ మాట్లాడుతూ దేశంలో మొదటిసారిగా 1986లో వినియోగదారుల రక్షణ చట్టం ప్రవేశపెట్టారని తెలిపారు. మళ్లీ లోపాలు సవరించి 2019 వినియోగదారుల చట్టాన్ని తీసుకువచ్చారన్నారు. ఈ చట్టం ద్వారా వినియోగదారుల రక్షణ కోసం ఆరు హక్కులు కల్పించారని తెలిపారు. ప్రిన్సిపాల్ గిరిబాబు మాట్లాడుతూ విద్యార్థి స్థాయి నుండి వినియోగదారుల హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఏలూరు నగర వీధులలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ ఎం. అజయ్ కుమార్, టీవీ దుర్గా ప్రసాద్, ఎస్.పరమేష్, వీ. వెంకటేశ్వరరావు, సీహెచ్ ఉదయలక్ష్మి, వినియోగదారుల ఉద్యమ ప్రతినిధులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటోలపై ఈ-చలానాలను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరంలో ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్ల వద్ద జీబ్రా లైన్ వైలేషన్ పేరుతో ఆటోవాలాలపై ఈ- చలానాలు విధించారని తక్షణం వాటిని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజు కోరారు. స్థానిక నరసింహారావుపేటలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ సమావేశం బుద్దా నాగసూరిబాబు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న లింగరాజు మాట్లాడుతూ రవాణా రంగ కార్మికులందరికీ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి జె.గోపి, యూనియన్ నాయకులు నత్త వెంకటేష్, మేరుగు రాఘవ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	34	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	36	చిక్కుడు కాయలు	60–72
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	07–10
బెండకాయలు	30	కంద	60
పచ్చిమిర్చి	34	బీట్‌రూట్	40
కాకర కాయలు	28–32	కీరా దోస	44
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	92
బీరకాయలు (పందిరి)	44	అల్లం	120
క్యాబేజీ	20	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	44	పాలకూర	10
దొండకాయలు	30	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	45–50	గోంగూర	06
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	22	బఠాణి	--
అనబకాయ (1)	20–25	క్యాప్సికమ్	64
పొట్లకాయ(1)	15–20	చిలకడదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	16
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	06
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	30
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	08
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	11
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	10
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	06
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4822	--
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	16
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	రద్దు
ఏలూరు –తిరుపతి	16.00	4830	26

మహాధర్నాను జయప్రదం చేయాలి



కోటదిబ్బ ఎస్ఆర్ వన్ వద్ద మాట్లాడుతున్న బండి వెంకటేశ్వరరావు

ఏలూరు (టూటౌన్): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈ నెల 27.28 తేదీల్లో విజయవాడలో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు పిలుపు నిచ్చారు.ఈ మహాధర్నాకు ఏలూరు నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు హాజరు కావాలని కోరారు. స్థానిక కోటదిబ్బ ఎస్ ఆర్ వన్ వద్ద ఏఐటీయూసీ అనుబంధ జోనల్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించనున్న మహాధర్నాను, డిసెంబరు 9,10 తేదీల్లో ఏలూరులో నిర్వహించనున్న ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ప్రథమ మహాసభ నిర్వహణపై ప్రచార కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏలూరు ఏరియా కార్యదర్శి ఎ.అప్పలరాజు, సీహెచ్ హరినాథ్‌బాబు, దుర్గారావు, వెంకట్, శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం ఏఐటీయూసీ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో ఏఐటీయూసీ ఏలూరు ఏరియా కమిటీ సమావేశం ఏరియా అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఉప్పులూరి హేమశంకర్, రెడ్డి శ్రీనివాస డాంగే, పుప్పాల కన్నబాబు, భజంత్రీ శ్రీనివాసరావు, జోగి నాగేశ్వరరావు, కాటూరి శ్రీధర్, పుప్పాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వృద్ధుల సేవలో ఎన్‌సీసీ క్యాడెట్లు




ప్రేమాలయంలో వృద్ధులతో ఎన్‌సీసీ క్యాడెట్లు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): 76వ ఎన్‌సీసీ వారోత్సవాల్లో భాగంగా స్థానిక సీఆర్ఆర్ కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ ఎం. నవీన్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ప్రేమాలయం వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. శనివారం మధ్యాహ్నం వృద్ధాశ్రమంలోని 50 మంది వృద్ధులతో ఆటలాడించి వారికి మానసికంగా తాము తోడున్నామనే భరోసా కల్పించారు. అనంతరం వారికి భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేఎస్ విష్ణుమోహన్,ప్రిన్స్‌పాల్ కేఏ రామరాజు, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

సీఐ కార్యాలయాన్ని సందర్శించిన ట్రైనీ కలెక్టర్

భీమడోలు: భీమడోలు పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని శనివారం ట్రైనీ కలెక్టర్ పూజ సందర్శించారు. తన శిక్షణ కాలంలో భాగంగా ఆమె సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించి సీఐ బీబీ రవికుమార్ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యాలయ సిబ్బంది, పోలీసుల విధులు, బాధ్యతలను తెలుసుకున్నారు. సర్కిల్ కార్యాలయపు రికార్డులు, కేసుల నమోదు అంశాలను ట్రైనీ కలెక్టర్ పూజ క్షుణ్ణంగా తెలుసుకున్నారు. కేసుల పురోగతి వివరాలు, కేసుల నమోదు వాటి పరిష్కారం తదితర అంశాలపై ఆరా తీసారు. కార్యక్రమంలో ఎస్సై చావా సురేష్‌కుమార్, పోలీసులు పాల్గొన్నారు.

2నుంచి రజక వృత్తిదారుల రాష్ట్ర శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న మున్నూరు భాస్కరయ్య

ఏలూరు (టూటౌన్): రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర శిక్షణ తరగతులు వచ్చే నెల 2,3,4 తేదీల్లో తాడేపల్లిగూడెంలోని అపరాల మార్కెట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) భవనంలో నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మున్నూరు భాస్కరయ్య తెలిపారు. స్థానిక పవరుపేటలోని ప్రజా సంఘాల జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజక వృత్తి దారులపై దాడులు దౌర్జన్యాలు, అత్యాచారాలు, హత్యలు చేస్తూ అక్రమ కేసులు బనాయిస్తూ తీవ్ర సామాజిక హింసకు గురి చేస్తున్నారన్నారు. రజకులకు సామాజిక రక్షణ కల్పించాలన్నారు. ఈ సమావేశంలో రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మడక రాజు, చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు పాల్గొన్నారు.

లింగ వివక్షతో అభివృద్ధికి విఘాతం

పెదవేగి : లింగ వివక్ష సమాజాభివృద్ధికి విఘాతం కలిగిస్తుందని దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పెదవేగి ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్ అన్నారు. శనివారం పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో లింగ వివక్షకు వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో ప్రచార కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. జెండర్ వివక్షత పై నవంబర్ 25 నుంచి డిసెంబర్ 22 వరకు స్వయం సహాయక సభ్యులకు ఎంపీడీఓ అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ ప్రధాన రహదారిపై లింగ వివక్షకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో జి.రాజ్ మనోజ్ , ఏపీఎం.శరత్ బాబు, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు శాంత రత్నం పాల్గొన్నారు.